క్లుప్తంగా

వర్షం కోసం పూజలు



పూజ చేసేందుకు ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

కౌతాళం: వర్షం కోసం మండల కేంద్రమైన కౌతాళంలో మంగళవారం దేవాలయాలకు, దర్గాలకు, బొడ్డురాళ్లకు నీళ్ల పోసి పూజలు చేసి 101 బిందెలతో జలభిషేకం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పంటలు సాగుచేసుకుని రెండున్నర నెలలు గడిచినా వర్షం లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వర్షం కోసం గ్రామంలో వెలసిన ఆలయాలకు, దర్గాలకు పూజలు చేశారు. బొడ్డురాళ్లకు నీళ్ల పోశారు. ప్రత్యేక పూజలు చేసి 101బిందెల నీళ్లతో జలభిషేకం నిర్వహించారు.

ముగిసిన రేణుకా ఎల్లమ్మవ్వ ఉత్సవాలు



ఎల్లమ్మవ్వకు మంగళహారతి ఇస్తున్న పూజారి

ఆదోని అర్బన్: ఆషాఢమాసం సందర్భంగా ఎల్లమ్మకొండలో వెలిసిన శ్రీ రేణుకా ఎల్లమ్మవ్వ ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయ నిర్వాహకుడు మోహన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, గర్భగుడిలో ప్రత్యేక పూల అలంకరణ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆదోని చుట్టుపక్కలప్రాంతాల వారు ఆలయం వద్దకు చేరి అక్కడే పిండి వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అమ్మవారిని దర్శించుకున్నారు. డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఉధృతంగా తుంగభద్ర



నాగలదిన్నె బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

నందవరం: టీబీ డ్యామ్ ఎగువ భారీ వర్షాలు కురుస్తుడడంతో తుంగభద్ర నదికి నీరు విడుదల చేశారు. నాగలదిన్నె బ్రిడ్జి వద్ద తుంగభద్రమ్మ ఉధృతంగా ప్రవాహిస్తోంది. టీబీ డ్యామ్ ఎగువన భారీ వర్షాలు కురవడంతో జలాశయానికి వరద నీరు పోటెత్తడంతో డ్యాం గేట్లు ఎత్తి ఆదివారం దిగువకు 1.51 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. దీంతో మంగళవారం నాగలదిన్నె బ్రిడ్జి వద్ద తుంగభద్రమ్మ పరవళ్లుతోకుతుంది. నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, హెల్త్ సిబ్బంది

కోసిగి: పరిసరాల శుభ్రతతోనే అంటు వ్యాధులు రాకుండా దూరం చేయవచ్చని డాక్టర్ అభిరూప్ అన్నారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆరోగ్య సిబ్బందితో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షకాలంలో సీజనల్ వ్యాధులు అతిసారం, డెంగీ, మలేరియా, కుష్టు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు, ఈగలు వాలిన తినబండరాలు, ఆహార పదార్థాలు తినకూడదన్నారు. ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఆరోగ్య విస్తరణ కోశాధికారి రాముడు, హెల్త్ సూపర్ వైజర్ ఉదయ్ కుమార్, యామిని తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యంతో సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్ బాబు

కోసిగి: మండల కేంద్రానికి చెందిన భూగేని గోపాల్ అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం సమాచారం మేరకు నది తీర గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా పులికనుమ పంప్ హౌస్ వద్ద బైక్‌పై కర్ణాటక మద్యం తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద 10 బాక్స్‌లలో 960 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బైక్‌ను సీజ్ చేసి వ్యక్తి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో సెబ్ పోలీసులు నాగరాజు, మధులు ఉన్నారు.

కొత్త చట్టాలొచ్చాయ్ జాగ్రత్త!

- పాత చట్టాలను మార్పు చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఈనెల 1నుంచి అమల్లోకి కొత్త క్రిమినల్ యాక్ట్
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన శిక్షలు
- చట్టాలపై పోలీసు శాఖ విస్తృత అవగాహన కార్యక్రమాలు

ఆదోని అర్బన్: ఇకపై చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన శిక్షలు ఉంటాయి. చిన్నచిన్న పొరపాట్లే అయినా భారీగా జరిమానాలు చెల్లించడంతో పాటు జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుంది. ఈనెల 1నుంచి కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలను అమలులోకి తీసుకొచ్చింది. వీటిపై ప్రజలకు పోలీసు, న్యాయశాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఆదోని నియోజకవర్గ పరిధిలో డీఎస్పీ మొదలు ఎస్ఐ స్థాయి అధికారి వరకు ఆయా గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

బ్రిటీష్ కాలం నాటి చట్టాల మార్పు..

బ్రిటీష్ కాలం నుంచి సుమారు 165 సంవత్సరాలుగా అమలులో ఉన్న పాత చట్టాలు ప్రస్తుత సమాజ పరిస్థితులకు అనుగుణంగా లేవని డాక్టర్ రణబీర్‌సింగ్ కమిటీ ఇచ్చిన సిఫారసుల మేరకు భారతదేశ న్యాయ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలను తీసుకొచ్చింది. ఇండియన్ పీనల్ కోడ్ 1880 స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), సీఆర్‌పీసీ 1973 స్థానంలో భారతీయ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మంజునాథ్ (ఫైల్)

నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్షా అభినియం (బీఎస్ఏ) చట్టాలు ఈనెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయి.

పోలీసు శాఖకు పూర్తి అధికారం

ఆదోని నియోజవర్గ పరిధిలో ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకు వివిధ నేరాలకు సంబంధించి 328 కేసులు నమోదయ్యాయి. నూతన చట్టంలో ఈ–ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్‌కు చోటు లభించింది. కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్ లేకుండానే ప్రాథమిక విచారణ చేసే అవకాశం చట్టంలో కల్పించారు. ప్రాథమిక విచారణలో నేరం జరిగినట్లుగా రుజువైతే ఎఫ్ఐఆర్ నమోదవుతుంది. నూతన చట్టాల ప్రకారం న్యాయమూర్తులు కేసులను రెండు వాయిదాలకు మించి ఎక్కువ రోజులు పొడిగించడానికి వీలుండదు. పోలీసుశాఖకు పూర్తి అధికారాలు ఉండడంతో కేసు త్వరగా పూర్తి అవుతుంది. దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, విజిలెన్స్ విభాగాలకు దర్యాప్తు అధికారాలను నూతన విధానంలో అధికంగా కల్పించారు. జీరో ఎఫ్ఐఆర్ ద్వారా కాలయాపన జరగదు. బాధితులకు తక్షణ సాయం అందుతుంది. ఈ–సాక్షి, సంకలనం వంటి యాప్‌లను పోలీసు యంత్రాంగం కలిగి ఉండాలి.

చిన్న కేసులైనా పెద్ద శిక్షలు..

నూతన చట్టాల ప్రకారం దొంగతనం, గొలుసు చోరీ, చిన్న చిన్న కేసులు సైతం అరెస్టు అయ్యి జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. ఫోన్‌లో దూషించినా, ఫొటోలు మార్ఫింగ్ చేసి ఇబ్బందులకు గురి చేసినా కఠినమైన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మహిళలపై జరిగే దాడులు, లైంగిక వేధింపులు, ఫోక్సో కేసుల్లో రెండు నెలల్లోపు పోలీసు దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ వేయాల్సి ఉంది. కాలయాపన జరగకుండా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా నేరస్తులకు శిక్ష ఖరారు చేయనుండడంతో బాధితులకు భరోసా కలుగుతుంది. చిన్నపాటి నేరస్తుల్లో పరివర్తన తీసుకొచ్చేందుకు కమ్యూనిటీ సర్వీస్ చేసేలా శిక్షలు ఉన్నాయి.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా

ట్రాఫిక్ ఉల్లంఘనతో ప్రాణాలు కోల్పోతున్న క్రమంలో ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ ట్రాఫిక్ నిబంధనలు కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. గత ఆరు నెలల్లో ఆదోని నియోజకవర్గ పరిధిలో జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో 15 మంది గాయపడగా, ఒకరు మృతి చెందారు. కాగా ఆదోని ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో 51 మంది సిబ్బంది అవసరం కాగా 21 మాత్రమే ఉన్నారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణ కష్టతరంగా మారింది. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలుశిక్ష విధించేలా జీవో 21 మోటార్ వాహన చట్టంలోని సెక్షన్ 200 సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- చిన్నచిన్న కేసుల్లో నిందితులు పాఠశాలల్లో గానీ, పోలీస్‌స్టేషన్‌లో గానీ శ్రమదానం చేయాల్సి ఉంటుంది.
- యాక్సిడెంట్లలో వ్యక్తి చనిపోతే ఐదు సంవత్సరాలు జైలుశిక్ష ఉంటుంది. వ్యక్తికి ప్రమాదం కలిగిస్తే, ఇందులో ఆ వ్యక్తి చనిపోతే ప్రమాదం కలిగించిన వ్యక్తి ఎవరికి తెలియకుండా వెళ్లిపోతే పోలీసుల ఇన్వెస్టిగేషన్‌లో ఆ వ్యక్తి దొరికితే 10 సంవత్సరాల కారాగాశిక్ష ఉంటుంది.
- మద్యంతాగి వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానాతో పాటు ఆరు నెలల జైలుశిక్ష.
- మైనర్లకు వాహనం ఇస్తే తల్లిదండ్రులు జైలు శిక్ష.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



నూతన చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. ఏ కేసులోనైనా నేరస్తులు ఎంత వారైనా తప్పించుకోకుండా శిక్ష అనుభవిస్తారు. వాటి ప్రాప్తికి వివిధ కేసుల్లో బాధితులకు నేరుగా న్యాయం జరుగుతుంది. పారదర్శకంగా అవకాశం ఉంటుంది. దీంతో పట్టణంలో తమ సిబ్బందితో పాటు ప్రజలకు, వాహనదారులకు, ఉపాధ్యాయులకు న్యాయవాదులకు అవగాహన కల్పిస్తున్నాం.

– గోపీ, టూటౌన్ సీఐ

మైనర్లకు వాహనమిస్తే జరిమానా, జైలు శిక్ష

గతంలో ఐపీసీలో 511 సెక్షన్లు ఉండేవి. దానిని తీసివేసి కొత్త చట్టంలో 358 సెక్షన్లకు కుదించారు. చిన్న చిన్న పెట్టీ కేసులకు గతంలో మాదిరిగా పోలీస్‌స్టేషన్, పాఠశాలల్లో శ్రమదానం చేసేలా శిక్ష ఉంటుంది. మైనర్ వాహనం నడిపితే కోర్టులో నిరూపితమైతే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడిని దోషిగా పరిగణిస్తూ రూ.20 వేలు జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ వాహన లైసెన్స్‌ను రద్దు చేస్తారు. ప్రతిఒక్కరూ మూడు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి. ఇందుకోసం వాహనదారులకు మూడు కొత్త చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– మంజునాథ్, ట్రాఫిక్ సీఐ

- హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.1000 జరిమానా, లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేలు జరిమానా.
- పర్మిట్ లేని వాహనదారులకు రూ.10 వేలు, ఓవర్‌లోడ్ వేసుకొని వెళ్తే రూ.20 వేలు జరిమానా కొత్త చట్టంలో ఉన్నాయి.

రసం పీల్చే పురుగులతో పంటలకు ప్రమాదం

ఎమ్మిగనూరు రూరల్ /గోనెగండ్ల : రసం పీల్చే పురుగులతో పంటలకు ప్రమాదమని, నివారణకు రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ సుజాత, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ మోహన్ విష్ణువర్ధన్ అన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు మండలంలోని రాళ్లదొడ్డి, ఎర్రకోట, గోనెగండ్ల మండలంలోని వేముగోడు, పుట్టపాశం గ్రామాల్లో సాగుచేసిన పత్తి, వేరుశనగ, మిరప, కంది, సజ్జ పంటలను ఏడీఏ మహమ్మద్ ఖాద్రీతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంటల పరిశీలనలో పత్తిలో రసం పీల్చే పురుగుల తాకిడి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. బెట్ట పరిస్థితుల వల్ల తామర పురుగులు, పేను బంక, పిండి నల్లి ఉన్నట్లు గమనించడం జరిగిందన్నారు. వీటి నివారణకు థయోమిథక్సామ్ 0.3గ్రాములు లేదా ఫ్లోనికమయిడ్ 0.3 మిల్లీ లీటర్లు లేదా అసిటామిప్రిడ్ 0.3 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి మార్చి మార్చి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే పిండి నల్లి ఉధృతి ఎక్కువగా ఉంటే ప్రోఫినోఫాస్ 2 మిల్లీ లీటర్లు



పుట్టపాశంలో పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పత్తి పంట పూత దశలో ఉన్నందున లింగాకర్షక బుట్టలు ఎకరాకు 10 చొప్పున ఉంచితే గులాబీ రంగు పురుగును కొంతవరకు నివారించుకోచ్చని చెప్పారు. మిరప నారులో రసం పీల్చే పురుగుల వల్ల పై ముడత, కింద ముడత గమనించామని, కింద ముడత నివారణకు ప్రోపర్ గైట్ 0.5 మిల్లీ లీటర్లు లేదా డైకోఫాల్ 5మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జాకీర్, సత్తార్, రైతులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు తగ్గుతున్న ఇన్‌ఫ్లో

హొళగుంద: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. రెండు రోజుల క్రితం లక్షన్నర క్యూసెక్కులకు చేరిన ఇన్‌ఫ్లోతో మొత్తం 33 డ్యాం గేట్లు ఎత్తిన టీబీ బోర్డు అధికారులు.. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదిలేసిన సంగతి తెలిసిందే. డ్యాం ఎగువ భాగంలోని ఆగుంబే, శృంగేరి, తీర్థనహళ్లి, వరనాడు, శివమొగ్గ తదితర ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. దీంతో 12 గేట్లతో దాదాపు 50 వేల క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు. ప్రస్తుతం డ్యాం ఎగువన ఉన్న అప్పర్ తుంగా ప్రాజెక్ట్ నుంచి 30 వేలు, భద్రా డ్యాం నుంచి 10 వేలకు పైగా నీటిని నదికి వదులుతున్నారు. ఈ నీరు టీబీ డ్యాంకు చేరుతుంది. ఫలితంగా రాత్రికి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశముందని, దాన్ని బట్టి గేట్లను పెంచుతామని టీబీ బోర్డు అధికారులు తెలిపారు. ఇప్పటికే డ్యాంలో నీటినిల్వ పూర్తిమట్టానికి చేరడంతో వచ్చిన నీటిని అలాగే నదికి పంపిస్తున్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఆదోని టౌన్: పట్టణంలోని 5వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి పరిశీలించారు. తాగునీటి సరఫరాను, వీధి దీపాలకు సంబంధించి అన్ని పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో అని ఆ వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆరా తీశారు. అలాగే ప్రజల సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఆదోని సెంట్రల్: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటి త్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందించి సత్కరించారు. మంగళవారం ఎస్టీయూ పట్టణ శాఖ అధ్యక్షుడు రవి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సి. నాగరాజు , జిల్లా ఉపాధ్యాక్షుడు రమేష్ నాయుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో విద్యార్థిని ప్రతిభ

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని షాట్‌పుట్‌లో ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల హెచ్ఎం హరినాథ్ రావు, వ్యాయమ ఉపాధ్యాయుడు నర్సిములు తెలిపారు. మంగళవారం ఈ మేరకు విద్యార్థిని ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు. వారు మాట్లాడుతూ ఈనెల 27న కోసిగి మండలం జంపాపురం ఉన్నత పాఠశాలలో ఆర్జీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్



పవిత్రను అభినందిస్తున్న దృశ్యం

పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని పవిత్ర కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు.

దృష్టి లోపం ఉన్న పిల్లల వివరాలు ఇవ్వండి

గోనెగండ్ల : పాఠశాలల్లో దృష్టి లోపం ఉన్న పిల్లలుంటే వివరాలు ఇవ్వాలని అలాంటి వారికి కంటి అద్దాలను పంపిణీ చేస్తామని డాక్టర్లు సుజాత, రమేష్ తెలిపారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో జిల్లా, పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

కౌతాళం: ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్ అన్నారు. మంగళవారం స్థానిక కన్నడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంఈఓ శోభరాణితో కలిసి స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

పొలం రస్తా విషయంలో ఘర్షణ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పరమాన్‌దొడ్డి గ్రామంలో పొలాలకు వెళ్లే రస్తా విషయంతో మంగళవారం ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన వెంకటేష్‌కు చాకలి చిన్న రోగన్నకు పొలాలకు వెళ్లే రస్తా విషయంలో కొన్ని రోజుల నుంచి గొడవలు ఉన్నాయి. ఇదే విషయంతో ఉదయం మరోసారి ఇరువురు వాగ్వాదానికి దిగటంతో గొడవ పెద్దదై ఘర్షణకు దారితీసింది. గొల్ల వెంకటేష్ తలకు బలమైన గాయం కాగా గొల్ల మహానంది, లక్ష్మీనారాయణకు గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారికి ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిన్నరోగప్పతో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

హైదరాబాద్‌లో శ్రీమఠం పీఠాధిపతి

మంత్రాలయం : ధార్మిక పర్యటనలో భాగంగా రాఘవేంద్ర స్వామి పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు హైదరాబద్‌లో పర్యటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉన్న రాఘవేంద్ర స్వామి మృతిక బృందావన మఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వనస్థలి పురం వాసులు ఘనంగా పీఠాధిపతిని ఊరేగించారు. మఠంలో విష్ణు హోమం చేపట్టారు. అనంతరం నూతనంగా నిర్మించిన సుజయింద్రీ కళ్యాణ మంటపాన్ని ప్రారంభించారు.



సుజయింద్రీ కళ్యాణ మంటపాన్ని, ప్రారంభిస్తున్న పీఠాధిపతి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలోని రాంజల వద్ద 33కేవీ విద్యుత్ లైన్ నిర్వహణ, కొత్త లైన్ పనులు నిర్వహిస్తుండడం వల్ల బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంజల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి

పెద్దకడబూరు : రాష్ట్రంలో పాఠశాల విద్యారంగాన్ని కాపాడుకునేందుకు జీఓ నెంబర్ 117ను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కొలన్న, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ప్రశాంత్, భూపాల్, శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈఓలు సువర్ణల సునియం, రామమూర్తి, డిప్యూటీ తహసీల్దారు మహేష్, మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్స్ రాఘవేంద్ర, లింగన్న, గౌరవ అధ్యక్షుడు శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి

నందవరం : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని, నాణ్యత పాటించాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఐసా) జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామస్తులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారని, గుడ్లు కూడా చెడిపోయాయన్నారు. నాయకులు రాజు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల : మండల పరిధిలోని ఎర్రబాడు గ్రామానికి చెందిన బోయ నెర్జికే లిక్కన్న(32) కడుపు నొప్పి తాళలేక చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు ఎర్రబాడు గ్రామానికి చెందిన బోయ లిక్కన్నకు భార్య అరుణ, ఇద్దరు కుమారులు, కుతూరు ఉంది. బోయ లిక్కన్న మూడు సంవత్సరాల నుంచి కడుపు నొప్పి, మొలల నొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నొప్పి తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారు జామున గ్రామ పొలిమేరలో ఉన్న వేపచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పనిభారం తగ్గించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని ఏఐటీయూసీ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగురుడు ు కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రవి, ఖలీల్, వలిబాషా, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

కౌతాళం: ఉరకుంద ఈరన్నస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. మంగళవారం ఆయన ఈరన్నస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి. వెంకటేశ్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం ఎస్పీ దేవాలయ పరిసరాల్లో పర్యటించి శ్రావణ మాస ఏర్పాట్లపై సమీక్షించారు. పార్కింగ్ కోసం చేసిన ఏర్పాట్లపై కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, కోసిగి సీఐ ప్రసాద్‌ని అడిగి తెలుసుకున్నారు. టెంకాయలు, వివిధ సామగ్రిని అధిక రేట్లకు



స్వామిని దర్శించుకుంటున్న ఎస్పీ బిందు మాధవ్

అమ్మితే వారిపై చర్యలు తీసుకోవాలిన, కళ్యాణకట్ట వద్ద భక్తులకు ఇబ్బందులు కలిగించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, కోసిగి, మంత్రాలయం ఎస్ఐలు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ నిధులు తమకే కేటాయించాలి

ఆదోని రూరల్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం తమ వాటా నిధులను తమకే కేటాయించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలోని ఆర్డీటీ హాల్‌లో రెండు రోజుల కేవీపీఎస్ జిల్లాస్థాయి సామాజిక చైతన్య శిక్షణ తరగతులు ప్రారంభించారు. కేవీపీఎస్ మండల కార్యదర్శి బి.తిక్కప్ప అధ్యక్షతన సభను నిర్వహించారు. మాల్యాద్రి మాట్లాడుతూ తరాలు మారుతున్నా దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా దళితులపైన జరుగుతున్న దౌర్జన్యాలు మాత్రం ఆగడం లేదన్నారు. శిక్షణ పొందిన ప్రతి కార్యకర్త అణగారిన సామాజిక తరగతు



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి

లకు మరింత అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిన్నమారయ్య, మండలాధ్యక్షులు మునిస్వామి, గ్రామ నాయకులు పరమేష్, వీరేష్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల్లో నిరంతరాయంగా విద్యుత్ అందించాలి

ఆదోని అర్బన్: పట్టణంలో జరగబోయే గణేష్ ఉత్సవాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆదోని పట్టణ గణేష్ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు కోరారు. మంగళవారం పట్టణంలోని స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆదోని పట్టణ గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదోని పట్టణానికి అనుకూలంగా ప్రతి వినాయక ఉత్సవ సమితి సభ్యులు 14 అడుగుల లోపు వినాయకుడిని కూర్చోబెట్టాలని, సాధ్యమైనంతవరకు అందరూ మట్టి వినాయకులనే ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి సభ్యులు గోవిందరాజుగౌడ్, విట్టా రమేష్, దేవిశెట్టి ప్రకాష్, కునిగిరి నీలకంఠ, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల్లో కనీస వసతుల్లేవు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు కనీస మౌలిక వసతుల్లేకుండా నిర్వహిస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, యుఎస్ఎఫ్ఐ ,పీఎస్‌యు నాయకులు ఉదయ్‌కుమార్, సురేష్ తెలిపారు. ఈమేరకు మంగళవారం రాయలసీమ యునివర్సిటీలో వీసీ ఎన్‌టీకే నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని గంజిహళ్లి రోడ్డులోని పలు వీధుల్లో నీటి సరఫరాను పరిశీలించారు. మంచినీటిని వృథా చేయకుండా కుళాయిల ద్వారా వచ్చే నీటిని కాచి వడబోసి తాగాలని ప్రజలకు సూచించారు. సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్, ధోబీ ఘాట్ ఏరియాల్లోని ప్రధాన డ్రైన్లలో పూడిక తీత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీపీఓ గోపాలకృష్ణ, మున్సిపల్ డీఈఈలు నీరజ, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధోబీఘాట్ ప్రాంతంలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి



అడ్డపల్లకీలో పీఠాధిపతిని ఊరేగిస్తున్న భక్తులు ,



156 కలశాలతో మహిళల ఊరేగింపు

ఆదోని అర్బన్: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడిస్తే హింస పెరగదని, శత్రుత్వం ఉండదని కాశీ క్షేత్రం పీఠాధిపతి శ్రీశ్రీ1008 జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్యులు అన్నారు. స్థానిక పేట వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో 8 రోజుల పాటు సిద్ధరామేశ్వర పురాణం జరిగింది. మంగళవారం 9వ రోజు సందర్భంగా వీరశైవ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పీఠాధిపతికి అడ్డపల్లకీసేవ నిర్వహించారు. అడ్డపల్లకీలో కాశీక్షేత్రం పీఠాధిపతిని కూర్చోబెట్టి ఊరేగింపు నిర్వహించారు. స్వామిక పేట వీరభద్రేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన అడ్డపల్లకీ సేవ బంగారు బజార్ మీదుగా రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న రెడ్డీస్ కల్యాణ మండపం వరకు సాగింది. మహిళలు, యువత 156 కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. కళ్యాణ మండపంలో కంచి విగ్రహంతో తయారు చేసిన రేణుకాచార్యుల విగ్రహానికి 156 కలశాలలో తెచ్చిన నీటితో జలాభిషేకం చేశారు. డోలు, సన్నాయి, నందికోలు, వీరగాస, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. అనంతరం రెడ్డి కళ్యాణ మండపంలో పీఠాధిపతిచేత ధర్మసభ ప్రసంగం జరిగింది. లింగాయతీలు లింగపూజ చేయడం మరువరాదని, ప్రతిఒక్కరూ ధర్మాన్ని పాటిస్తే ప్రకృతి కూడా ధర్మమార్గంలోనే మనకు కావాల్సిన సౌకర్యాలు అందజేస్తుందన్నారు. బుధవారం ఇష్ట లింగ పూజా కార్యక్రమాలు ఉంటాయని, వీరశైవ మహిళా సమాఖ్య సభ్యులు నాగరత్నమ్మ, తేజస్విని, మహేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో పాల్తూరు, గంగమహాసళ్లి, కల్లుమఠం పీఠాధిపతులు చిన్నవీరస్వామి, అజాతశంభులింగ శివాచార్యులు, గురుసిద్ధదేవరు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

వీరశైవ మహిళా సంఘం ఆధ్వర్యంలో జరిగిన అడ్డపల్లకీసేవ, ధర్మసభలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు పీఠాధిపతి శాలువా కప్పి పూలమాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.